నమస్తే తెలంగాణ
నిజామాబాద్
10 | నిజామాబాద్, శనివారం 14 డిసెంబర్ 2024 | NIZAMABAD

తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత!

ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న క్వారీల్లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. వందల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను తరలించుకు పోతున్నారని, వాహనాల పరుగులతో దుమ్ము ధూళి రేగి పంటలు చెడిపోతున్నాయని వాపోతున్నారు. మంజీరా తీరాన ఇసుక అక్రమ తవ్వకాలపై 'క్వారీల్లో అక్రమాల జాతర – నిబంధనలకు పాతర' పేరిట ఇటీవల 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో అధికార యంత్రాంగం కదలడంతో కొన్ని రోజులపాటు ఈ ఇసుక క్వారీలో తవ్వకాలు నిలిచి పోయాయి. మళ్లీ ఇటీవలే ఇసుక తవ్వకాలు ప్రారంభంకావడంతో వందలాది ట్రాక్టర్లు క్యూ కట్టాయి. దీంతో రైతుల్లో మళ్లీ కలవరం మొదలైంది. పెద్ద ఎత్తున ఇసుక ట్రాక్టర్లు వస్తుండడం, విచ్చలవిడిగా ఇసుక రవాణా జరుగుతుండడంతో మంజీరా తీరాన రైతులు వేసుకున్న పైపులైన్లు పగిలిపోతున్నాయి.

పగులుతున్న పైపులు..

సిద్ధాపూర్, చుట్టుపక్కల గ్రామాల రైతులు సాగు నీటి కోసం మంజీరా తీరంలో ఫిల్టర్ పాయింట్లపై ఆధారపడి పంటలను సాగు చేసుకుంటున్నారు. మంజీరా తీరాన రైతులు వేసుకునే ఈ ఫిల్టర్ పాయింట్లతో తక్కువ లోతులోనే భూగర్భజలాల లభ్యత ఉంటుంది. ఈ ఫిల్టర్ పాయింట్ల నుంచి పైపులైన్ల ద్వారా నీటిని పొలాలకు తీసుకెళ్తుంటారు. ఇసుక తవ్వకాలతో ఇప్పుడా ఫిల్టర్ పాయింట్లకు, పైప్‌లైన్లకు ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే అనేకమంది రైతుల పైప్‌లైన్లు పగిలిపోయాయి. ఒకపక్క భూగర్భజలాలు పడిపోతుండగా, మరోపక్క తాము వేసుకున్న పైపులైన్లు ధ్వంసమవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ పైపులైన్లు వేసుకోవాలంటే వేలాది రూపాయలు ఖర్చవుతాయని అంటున్నారు. ఇప్పటికే పంటలు పండించడం భారంగా మారిందని, ఈ పరిస్థితుల్లో తాము మళ్లీ పైపులైన్లను వేసుకోవటమన్నది తమకు తలకు మించిన భారమవుతుందని వాపోతున్నారు.

సిద్ధాపూర్ క్వారీలో ఇసుక లోడ్‌తో క్యూ కట్టిన ట్రాక్టర్లు

మంజీరా తీరాన రైతు గగ్గోలు

రైతుల ఫిల్టర్ పాయింట్ల వద్ద ఇసుక తవ్వకాలు

సిద్ధాపూర్ క్వారీ ఇసుక ట్రాక్టర్ల వల్ల పగిలిపోయిన ఓ రైతుకు చెందిన ఫిల్టర్ పాయింట్ పైప్‌లైన్

- సిద్ధాపూర్ ఇసుక క్వారీలతో అల్లాడుతున్న రైతాంగం
- పగులుతున్న పైప్‌లైన్లు
- పాడవుతున్న పంటలు
- ధ్వంసమవుతున్న రోడ్లు

బోధన్, డిసెంబర్ 13 : మంజీరా నది తీరాన సిద్ధాపూర్ ఇసుక క్వారీలు రైతాంగం పాలిట శాపంగా మారాయి. క్వారీల నుంచి ఇసుక లోడ్‌తో వచ్చే టిప్పర్లు, ట్రాక్టర్లతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిద్ధాపూర్ వద్ద స్థానిక అవసరాల కోసం ప్రభుత్వం ట్రాక్టర్ల క్వారీని ఏర్పాటుచేసింది. సిద్ధాపూర్ – ఖండ్‌గావ్ గ్రామాల మధ్య ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం ఇసుకను తీసుకెళ్లే టిప్పర్ల కోసం మరో క్వారీని నడుపుతున్నది. టిప్పర్ల క్వారీ నుంచి అధిక లోడ్‌తో వచ్చే వాహనాల వల్ల రోడ్లు ధ్వంసమవుతుండగా, ఇసుక లోడ్‌తో వచ్చే ట్రాక్టర్ల కారణంగా పంటలు దెబ్బ తింటున్నాయి. దీంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా రైతులు బెంబేలెత్తిపోతున్నారు. పైప్‌లైన్లు పగిలిపోతున్నాయని, రోడ్డు పక్కన పంటలు దుమ్మూధూళితో నిండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్..

అధిక లోడ్‌తో వచ్చే ఇసుక ట్రాక్టర్లు పొలాల్లోకి చొచ్చుకువస్తున్నాయని రైతులు అంటున్నారు. దీంతో తమ పొలాల గట్లు ధ్వంసమవుతున్నాయని, నేల గట్టి పడితున్నదని చెబుతున్నారు. ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్ల వల్ల దుమ్ము, ధూళి రేగడం, అవి పంటలపై పడడంతో పంటలకు నష్టం జరుగుతున్నది. క్వారీల నుంచి మెయిన్ రోడ్డు వరకు ఉన్న దారుల్లో దుమ్ము రేగకుండా ట్యాంకర్లతో నీళ్లను ఎప్పటికప్పుడు చిమ్ముతుండాలి. కానీ అలా జరగడంలేదు. తీవ్రంగా నష్టపోతున్న రైతులు పలుమార్లు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. అన్నదాతలకు అండగా ఉండాల్సిన అధికారులు వారికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ట్రాక్టర్లు ఆపితే కేసులు పెడతామంటూ పోలీసులు బెదిరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

ధ్వంసమవుతున్న రోడ్లు

ఇసుక క్వారీల కారణంగా రహదారులు ధ్వంసమవుతున్నాయి. సిద్ధాపూర్‌లోని క్వారీల నుంచి వచ్చే ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లతో పాటు ఈ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇతర వాహనాలతో సిద్ధాపూర్ నుంచి కల్దుర్కి మీదుగా ఇటు బోధన్, అటు నిజామాబాద్‌కు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. తాము చందాలు వేసుకుని రోడ్లపై గుంతలను పూడ్చివేస్తే ఇసుక వాహనాలతో రోడ్లు మళ్లీ పాడయిపోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు మొత్తుకుంటున్నారు.

చేన్లకెళ్లి ట్రాక్టర్లు తీసుకపోయిండ్రు..

అచ్చే సీజన్ల వరి నాటు వేద్దామని దున్నినం. దున్నిన చేన్లకెళ్లి ట్రాక్టర్లు తీసుకపోయిండ్రు. ట్రాక్టర్ల పోయిన జాగా మొత్తం గట్టిగా అయింది. ఇప్పుడు మళ్లా దున్నాలంటే మళ్లీ పైసలు పెట్టలె. దమ్ము చేసుడు కూడా కష్టమయితది. లేబర్ నాట్లు కూడా వెయ్యరు.. మస్తు ఖర్చయితది. మేం గరీబోళ్లం. కష్టం చేసి బతికేటోళ్లం. ఇట్ల చేస్తే ఎట్ల? అక్కడ ఏట్ల కూడా మాకు పైపులు ఉన్నాయి. ట్రాక్టర్లు పోవుడుతోని అవి కూడా పగిలినయ్. మాకు న్యాయం కావాలె..

- కాంతాబాయి, మహిళా రైతు, సిద్ధాపూర్

తంబాకు పంట ఖరాబయ్యింది..

నా చేన్ల తంబాకు పెట్టిన.. గీ ఇసుక ట్రాక్టర్లతో దుమ్ము పడి పంట ఖరాబయ్యింది. పెట్టుబడి మస్తు పెట్టి తంబాకు నాటిన. ఇసుక ట్రాక్టరోళ్లు నా పంటను ఖరాబ్ చేసిండ్రు. నా పైపులైన్లు పగలగొట్టిండ్రు.. వైర్లు తెంపేసిండ్రు. పెట్టుబడి అంతా లాస్ అయిన. ఈ లాస్ ఎవరిస్తరు?

- నాగయ్య, రైతు, సిద్ధాపూర్

పైపులైన్లు పగిలి పోతున్నయి..

ఇసుక క్వారీ నుంచి ట్రాక్టర్లను విచ్చలవిడిగా నడుపుతున్నరు. చేన్లకు వచ్చే పైపులైన్లు పగిలిపోతున్నయి. రేపు మేము నాట్లు వేస్తే నీళ్లు ఎట్ల వస్తాయ్. పైపులైన్లు బాగుంటేనే నీళ్లు సరిగా అందక కష్టంగా వ్యవసాయం చేస్తున్నం. నాట్లు వేసిన తర్వాత కూడా పైపులైన్ పగిలిపోతే పంట ఎండిపోతుంది. వచ్చేది ఎండాకాలం. పంటలు ఎట్ల పండుతాయో తెలియడం లేదు. ఈ ఇసుక ట్రాక్టర్లను కంట్రోల్ చేయాలి. మా పంటలు దెబ్బతినకుండా చూడాలి.

- పీరాజీ, రైతు, సిద్ధాపూర్

ఎమ్మెల్సీ కవితతో బీఆర్ఎస్ బోధన్ నాయకులు

ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

బోధన్ రూరల్, డిసెంబర్ 13 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. బీఆర్ఎస్ బోధన్ నియోజకవర్గ నాయకులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో శుక్రవారం కలిశారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితిని వివరించారు. ఆరు గ్యారెంటీల అమలుపై పోరాటం చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని నాయకులకు సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో బీఆర్ఎస్ బోధన్ మండల అధ్యక్షుడు ధర్మయ్యగారి సంజీవ్‌కుమార్, యువజన విభాగం బోధన్ నియోజకవర్గ అధ్యక్షుడు భవానీపేట్ శ్రీనివాస్, నాయకులు అల్లాడి దేవా, షాకీర్, కొప్పర్గ రాములు, రవి తదితరులు ఉన్నారు.

రైతులకు న్యాయం చేయండి

ఎస్సారెస్పీ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

- 20, 21 ప్యాకేజీ పనులు సత్వరమే పూర్తి చేయాలి
- ఎస్సారెస్పీ వద్ద టూరిజం ప్రాజెక్టు తేవాలి
- మంత్రి ఉత్తమ్‌కు ప్రశాంత్‌రెడ్డి విజ్ఞప్తి
- కాంగ్రెస్ ప్రభుత్వం బేషజాలకు పోవద్దు
- మేడిగడ్డ వద్ద మరమ్మతులు చేపట్టాలి
- ఏడాదైనా ఇంకా మాపైనే ఏడ్పులా?
- విలేకరులతో మాజీ మంత్రి వేముల

మోర్తాడ్/ముప్కాల్, డిసెంబర్ 13: సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఎలాంటి బేషజాలకు పోకుండా మేడిగడ్డ వద్ద మరమ్మతులు చేపట్టి, కాళేశ్వరం ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. శుక్రవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సందర్శన, సమీక్షకు వచ్చిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని మంత్రి ప్రశాంత్‌రెడ్డి కలిసి పలు విజ్ఞాపనలు అందజేశారు. అనంతరం వేముల విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం సాగునీటి విషయంలో రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి, సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం కుంగిందని, ఎక్కడో చిన్న డ్యామేజీ జరిగిందని ఇంకెన్నాళ్లు ప్రచారం చేస్తారని ప్రశ్నించారు. మేడిగడ్డ కుంగింది అని చెబుతున్నారు. ఏడాది కాలమైపోయింది. ప్రభుత్వం బేషజాలకు పోకుండా అక్కడ మరమ్మతులు చేపట్టి రైతులకు నీళ్లు ఇవ్వాలన్నారు. 'మీరు అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం గడిచింది. ఇంకా మా మీద బురద జల్లడం ఆపి మేడిగడ్డ వద్ద మరమ్మతులు చేసి రైతాంగానికి నీళ్లు ఇవ్వండని' కోరారు. మేడిగడ్డ దగ్గర రిపేర్ చేస్తే సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులతో పాటు మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకు రావొచ్చన్నారు. ఎస్సారెస్పీ ఫేజ్–2తో పాటు కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయక్‌సాగర్ ప్రాజెక్టులను నింపుకోవచ్చని చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన 20, 21, 21 ఏ ప్యాకేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రూ.5,800 కోట్లతో చేపట్టనున్న ఆయా పనులతో బాల్కొండ నియోజకవర్గంలో 80 వేల ఎకరాలు, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 1.14 లక్షలు, ఆర్మూర్ నియోజకవర్గంలో 6 వేల ఎకరాలకు నీళ్లివ్వవచ్చన్నారు. తమ హయాంలో దాదాపు రూ.3,300 కోట్లు ఖర్చు పెట్టి 60 శాతం పనులు పూర్తి చేశామని, మిగతా పనులు సత్వరమే పూర్తి చేయాలని మంత్రికి విన్నవించారు. చిట్టాపూర్–ఫత్తేపూర్–సుర్బిర్యాల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులను వేగవంతం చేయాలని కోరారు. బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో 9,274 ఎకరాలకు సాగునీరందించేందుకు ఉద్దేశించిన ఈ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకంలో సిమెంట్ పైప్‌లైన్లు వాడడం వల్ల తరచూ లీకేజీలు అవుతున్నాయని, దీంతో చివరి చెరువు వరకు నీరు చేరడం లేదన్నారు. సిమెంట్ పైప్‌లైన్‌ను దశల వారీగా ఎంఎస్ పైప్‌లైన్‌గా మార్చాలని కోరారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం అనేక గ్రామాల ప్రజలు త్యాగాలు చేశారని, వారి త్యాగాలకు గుర్తుగా ప్రాజెక్టు పరిసర ప్రాంతంలో మెగా టూరిజం ప్రాజెక్టు చేపడితే ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. తాను మంత్రిగా ఉన్న సమయంలోనే మెగా టూరిజం ప్రాజెక్టు ఏర్పాటుకు స్థలం గుర్తించి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఎస్సారెస్పీ నుంచి బాసర వరకు బోట్ నడపడానికి ట్రయల్ కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఆయా ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించి ముందుకు తీసుకెళ్లాలని వేముల మంత్రిని కోరారు.

ఇసుకను తరలిస్తున్న

మూడు ట్రాక్టర్లు సీజ్

- డంపుల నుంచి వందలాది ట్రిప్పుల ఇసుక తరలింపు
- చివరిలో మూడు ట్రాక్టర్లను పట్టుకోవడంపై అనుమానాలు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మోర్తాడ్, డిసెంబర్ 13 : మోర్తాడ్ మండలంలో ఇసుక అక్రమ రవాణాపై 'ఆగని ఇసుక దోపిడీ' శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రిక శుక్రవారం కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన తహసీల్దార్ సత్యనారాయణ తనిఖీలు చేపట్టి.. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. మోర్తాడ్ తహసీల్ కార్యాలయ సమీపంలో ఉన్న డంపుల నుంచి ఇసుకను అక్రమంగా ఇతర ప్రాంతానికి శుక్రవారం తరలిస్తుండగా మూడు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేయడంతోపాటు జరిమానా విధించినట్లు వెల్లడించారు. వందలాది ఇసుక ట్రిప్పులు డంపులుగా ఉండగా.. అక్కడి నుంచి ఉదయం 9 గంటల నుంచే ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించారు. వందలాది ట్రిప్పుల ఇసుక తరలించిన అనంతరం కేవలం మూడు ట్రాక్టర్లను మాత్రమే పట్టుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తహసీల్దార్ సీజ్ చేసిన ట్రాక్టర్లు

తండాలో ఉద్రిక్తత

- ఎనిమిదేండ్ల బాలికపై అఘాయిత్యం
- నిందితుడిపై కుటుంబసభ్యుల దాడి
- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
- బాలిక ఇంటిపై దాడికి యత్నించిన మృతుడి బంధువులు

తండాలో పోలీసుల బందోబస్తు

రెడ్యానాయక్ (ఫైల్)

రెంజల్, డిసెంబర్ 13: నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని ఓ తండాలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. బాలికపై ఓ వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన నిందితుడు చికిత్స పొందుతూ మృతి చెందడంతో అతడి బంధువులు బాలిక ఇంటిపైకి దాడికి వెళ్లారు. దీంతో రోజంతా తండాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తండాలో రెడ్యానాయక్ (50) కిరాణ షాపు నడిపిస్తున్నాడు. ఎనిమిదేండ్ల బాలిక గురువారం సాయంత్రం ఆయన దుకాణానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, రెడ్యానాయక్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశారు. అయితే, అప్పటికే కోపోద్రిక్తులైన బాధితురాలి కుటుంబ సభ్యులు మూసి ఉన్న దుకాణంపై దాడి చేశారు. బయటికి వచ్చిన రెడ్యానాయక్‌పైనా కర్రలు, పారతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని క్షతగాత్రుడ్ని జిల్లా దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ విషయం తెలిసి మృతుడి కుటుంబ సభ్యులు బాలిక ఇంటిపైకి దాడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఓ యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు యత్నించగా వారించారు. ఈ క్రమంలో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో ఉన్నతాధికారులు ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపారు. ట్రైనీ ఎస్పీ ప్రశాంత్ కిశోర్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ విజయ్‌బాబు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. శాంతిభద్రతలు అదుపు తప్పకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు.

బెల్టుషాపు తొలగించాలని ఆందోళన

తండాలో ఉన్న బెల్టు షాప్‌ను వెంటనే తొలగించాలని మహిళలు ఆందోళనకు దిగారు. మద్యం మత్తులోనే ఇలాంటి సంఘటనలు, ఇండ్లల్లో గొడవలు జరుగుతున్నాయని మండిపడ్డారు. పోలీసులు వారించబోగా, వారితో వాగ్వాదానికి దిగారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. స్పందించిన ఏసీపీ.. బెల్టుషాప్ తొలగిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు.

ఆగని నిర్బంధకాండ

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రీసోర్స్‌పర్సన్ల అరెస్టు
- తెల్లవారుజామునే ఆర్పీల ఇండ్లలోకి పోలీసులు
- మహిళలని చూడాకుండా ఠాణాలకు తరలింపు
- సమస్యలు పరిష్కరించమంటే అరెస్టు చేస్తారా?
- సర్కారు తీరుపై మండిపడ్డ మహిళా ఉద్యోగులు

బోధన్ పోలీస్‌స్టేషన్‌లో ఆర్పీలను నిర్బంధించిన పోలీసులు

శక్కర్‌నగర్/ఎల్లారెడ్డి రూరల్/ఆర్మూర్ టౌన్, డిసెంబర్ 13: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పోలీసుల నిర్బంధకాండ కొనసాగుతున్నది. ముందస్తు పేరుతో అరెస్టుల పర్వం యథేచ్ఛగా జరుగుతున్నది. డిమాండ్ల కోసం గొంతెత్తుతున్న వారిని అక్రమంగా అదుపులోకి తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొన్న సర్పంచులు, అంతకుముందు ఆశ కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు.. తాజాగా శుక్రవారం మెప్మా రీసోర్స్ పర్సన్ (ఆర్పీ)లను అదుపులోకి తీసుకున్నారు. బోధన్, ఆర్మూర్, ఎల్లారెడ్డి తదితర ప్రాంతాలకు చెందిన ఆర్పీలను అరెస్టు చేసి పోలీసుస్టేషన్లలో నిర్బంధించారు. మహిళలన్న సంగతి కూడా మరిచిపోయి తెల్లవారుజామునే ఇండ్లలోకి చొరబడి ఠాణాలకు తరలించారు. తమ సమస్యలు పరిష్కరించాలని మెప్మా రీసోర్స్ పర్సన్లు ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. దీంతో డిమాండ్ల సాధన కోసం మెప్మా ఆర్పీలు చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎవరూ ఇంటి నుంచి బయటికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఆర్పీలను వారి ఇండ్ల నుంచి బలవంతంగా తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించారు. అలాగే, ఎల్లారెడ్డి, ఆర్మూర్‌లోనూ ఆర్పీలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రీసోర్స్‌పర్సన్లు మాట్లాడుతూ.. ఏడు నెలలుగా తమకు వేతనాలు లేవని వాపోయారు. అయినా తాము విధులు నిర్వర్తిస్తున్నామని, కానీ ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవడం లేదని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ 'చలో హైదరాబాద్'కు పిలుపు ఇచ్చిందని, ఈ క్రమంలో తమను అక్రమంగా ఇండ్ల నుంచి తెల్లవారుజామునే తీసుకొచ్చి స్టేషన్‌లో నిర్బంధించారని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు నెలకు రూ.20 వేల వేతనం, పీఆర్సీ వర్తింపజేయాలని అన్నారు.